మినీ కథ:

# ఎలా?

మా ఆఫీస్ కొలీగ్ బాలకృష్ణ ఎప్పుడూ ఇటువంటి విజ్ఞానం యిచ్చే పుస్తకాలే చదువుతుంటాడు. మనశ్శాంతి సాధించడం ఎలా? . మోక్ష సాధనం ఎలా? . కోపాన్ని నిగ్రహించుకోవడం ఎలా? ఇతరులను మంచి చేసుకోవడం ఎలా? ఇలాంటి "ఎలా? " పుస్తకాలు అతను కోకొల్లలుగా అలా అలా చదివాడు. ఇంకా సైకాలజీకి సంబంధించినవి, భగవద్గీత, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించే పుస్తకాలు ఎప్పుడూ చదువుతుంటాడు.

"ఈ పుస్తకం చాలాబావుంది. ఇందులో మంచి మంచి విషయాలు చాలా ఉన్నాయి. చదువుతారా?" అంటూ ఓ పుస్తకం ఇచ్చాడు నాకు ఒకసారి. "కోపం రాకుండా చూసుకోవడం ఎలా?"

"అబ్బే ఈ పుస్తకాలు కేవలం చదవడం వల్ల లాభం ఏముందీ? ఈ పుస్తకం చదివి ఇంకో పుస్తకం చదవడం మొదలుబెట్టగానే ఇందులోని విషయాలన్నీ మర్చిపోతాం అందుచేత వీటిని కేవలం చదవడమేకాక ఆచరణలో కూడా పెట్టాలి" అన్నాను నేను.

అతను నా మాటలను తీవ్రంగా ఖండించాడు. అటువంటి పుస్తకాలు చదవడంవల్ల వాటి ప్రభావం ఊహించని విధంగా మన మనసు మీద పడుతుందనీ అందుచేత ఆ పుస్తకాలు ఎప్పుడూ చదవాలనీ అన్నాడు.

నేనేమో కేవలం మంచి పుస్తకాలు చదవడం వల్ల మనిషి మారిపోడనీ, పుస్తకాలు చదవడం పది శాతం అయితే సాధన తొంభై శాతం ఉండాలనీ అన్నాను.

మా యిద్దరి మధ్యా తీవ్రమయిన వాగ్యుద్ధం నడిచింది. సెక్షనులోని అన్ని తలలూ మావైపు తిరిగాయి.

ఉన్నట్లుండి బాలకృష్ణ రయ్యిమని పైకి లేచిపోయాడు.

"అయితే నేనేమో తెలివి తక్కువ దద్దమ్మలా ఈ పనికిమాలిన పుస్తకాలు చదువుతున్నానని మీ అభిప్రాయమా? " అంటూ మిర్రి మిర్రి మాశాడు.

నేనేమో అతని మూడ్ని పాడు చేసినందుకు క్షమాపణలు చెప్పుకుని వచ్చి నా సీట్లో కూలబడ్డాను.

డ్రేలోని పైల్సు ముందేసుకుంటూ ఒకసారి బాలకృష్ణ వైపు చూశాను.

అతను కాలాన్ని దుర్వినియోగం చెయ్యకుండా "కోపం రాకుండా చూసుకోవడం ఎలా?"ని చదువుకుంటున్నాడు—ధుమ ధుమ లాడుతున్న ముఖంతో.

—మల్లిక్